నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ బుధవారం 4 సెప్టెంబర్ 2024 | ADILABAD NIRMAL

వరద బాధితులకు నేను సైతం..

సీఎం సహాయనిధికి రూ.3వేలు అందించిన బాలిక

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 3వేల నగదును అందజేస్తున్న విద్యార్థిని

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 3 : వరద ముంపు బాధితులను ఆదుకోవాలనే ఆలోచనతో తన కిడ్డీ బ్యాంకులో దాచుకున్న రూ.3వేలను మంగళవారం మహబూబాబాద్ కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా సీఎం సహాయనిధికి అందిస్తున్న పదో తరగతి విద్యార్థిని ముత్యాల సాయిసింధు. ఈ సందర్భంగా సీఎం సహా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్ బాలికను అభినందించారు.

దుర్గ పేరిట రూ.5 లక్షలు డిపాజిట్

భైంసా పోస్టాఫీసులో అనాథ బాలిక దుర్గ పేరిట రూ.5 లక్షలు ఫిక్స్ డిపాజిట్ చేయిస్తున్న తహసీల్దార్ లింగమూర్తి

తానూర్, సెప్టెంబర్ 3 : బెల్‌తరోడ గ్రామానికి చెందిన అనాథ బాలిక మెరోల్ల దుర్గ పేరిట భైంసా పోస్టాఫీసులో మంగళవారం తహసీల్దార్ లింగమూర్తి, మాజీ సర్పంచ్ గోప సాయినాథ రూ.5 లక్షలు ఫిక్స్ డిపాజిట్ చేయించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన కుమారుడు ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ తరపున పంపిన రూ.ఒక లక్ష, దాతలు అందించిన రూ.4 లక్షలను కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు భైంసా పోస్టాఫీసులో ఫిక్స్ డిపాజిట్ చేశామని తహసీల్దార్ తెలిపారు.

కాంగ్రెస్, బీజేపీలు తోడు దొంగలు

రైతులను రెండు ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు

- పంట నష్టం పక్కన పెట్టి సీసీఐ సందర్శన
- కాంగ్రెస్ రైతులకు క్షమాపణ చెప్పాలి.. ● మాజీ మంత్రి జోగు రామన్న

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, సెప్టెంబర్ 3(నమస్తే తెలంగాణ) : ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్, బీజేపీలు తోడుదొంగలని మాజీ మంత్రి జోగు రామన్న మండిపడ్డారు. మంగళవారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన ఆయారాం, గయారాంలా కొనసాగిందని, వరదల కారణంగా నష్టపోయిన పంటలను మంత్రి పరిశీలించలేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడంలో విఫలమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పర్యటన గురించి ముందుస్తు సమాచారం లేదని, వరదల పరిస్థితిని సమీక్షించడానికి వచ్చిన మంత్రి ఏ ఒక్క గ్రామాన్ని సందర్శించకుండా, రైతులతో మాట్లాడకుండా స్థానిక ఎమ్మెల్యే సూచనల మేరకు సీసీఐ సందర్శనకు వెళ్లలేదని తెలిపారు. మంత్రి పర్యటనలో స్థానిక ఎమ్మెల్యే శంకర్ పంట నష్టం విషయంలో మాట్లాడలేదని ఆయన బీజేపీ ఎమ్మెల్యేగా కాకుండా కాంగ్రెస్ ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నారన్నారు.

సీసీఐని ప్రైవేటు పరం చేయాలని చూస్తున్నారు

సీసీఐని ప్రభుత్వం ప్రైవేటు కంపెనీలకు అప్పగించాలని చూస్తున్నదని మాజీ మంత్రి జోగు రామన్న ఆరోపించారు. ఇందుకోసం స్థానిక ఎమ్మెల్యే సహకారం అందిస్తున్నారని తెలిపారు. మాజీ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ సీసీఐని పునఃప్రారంభానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని కోరినా ఫలితం లేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు తాను ఎమ్మెల్యేగా సీసీఐని ప్రారంభించాలని కోరినా అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కన్నా లక్ష్మీనారాయ ణ ప్రారంభించే ప్రసక్తి లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే కమిషన్ల కోసం సీసీఐ ప్రారంభానికి పావులు కదుపుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు రమేశ్, ప్రహ్లాద్, రాజు, రమేశ్, పరమేశ్వర్, అశోక్ స్వామి, మోబీన్, ఆసిఫ్, రాములు పాల్గొన్నారు.

జైనథ్ మండలంలోని కరంజిలో ముంపునకు గురైన పత్తి పంటను పరిశీలిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

భీంపూర్ మండలంలోని అర్లిలో పంటలను పరిశీలించడానికి వాగులో నుంచి నడిచి వెళ్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

సహాయక చర్యల్లో గులాబీ సైన్యం

మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటన

- వరద బాధితులను ఆదుకుంటామని హామీ
- రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్

ఆదిలాబాద్, సెప్టెంబర్ 3(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా తీవ్ర నష్టం సంభవించింది. వాగులు పొంగి ప్రవహించడంతో రహదారులు దెబ్బతిన్నాయి. పెన్‌గంగా నదీ పరీవాహక ప్రాంతాల్లోని పంటలు నీటమునిగాయి. చెరువులు మత్తడి దుంకడంతో పొలాలు దెబ్బతిన్నాయి. చేతికొచ్చే దశలో ఉన్న పంటలు వరదల కారణంగా దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అన్నదాతలకు అండగా నిలవడానికి బీఆర్ఎస్ నాయకులు మంగళవారం జిల్లాలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పర్యటించి వరద నష్టాన్ని తెలుసుకున్నారు. దెబ్బతిన్న పంటలు, రోడ్లు, కల్వర్లు, ఇండ్లను పరిశీలించారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

భీంపూర్ మండలంలోని అర్లిలో రైతును ఓదాస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

రైతులను ఆదుకోవాలి..

ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న జైనథ్, బేల మండలాల్లో పర్యటించారు. జైనథ్ మండలంలోని కరంజి, కాప్రి, ఉమ్రి.. బేల మండలంలోని సాంగిడి, బెదోడ, మాంగ్రూడ్ గ్రామాల్లో నీట మునిగిన పంటను పరిశీలించారు. పెన్‌గంగా ప్రవాహంతోపాటు వాగులు పొంగడంతో రైతులు భారీగా పంటలను నష్టపోయారన్నారు. రైతులు అధైర్య పడొద్దని బీఆర్ఎస్ అన్నదాతల పక్షాన ప్రభుత్వంతో పోరాడుతామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు రూ.15 వేల సాయం, నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు అందించాలని డిమాండ్ చేశారు.

- మాజీ మంత్రి జోగు రామన్న

ఎకరాకు రూ.40 వేలు ఇవ్వాలి..

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తాంసి మండలంలోని కప్పర్ల మోడ్.. భీంపూర్ మండలంలోని అర్లి గ్రామంలో పర్యటించారు. పెన్‌గంగా ప్రవాహం వల్ల నష్టపోయిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. తాంసి మండలంలోని కప్పర్లమోడ్‌లో దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. భీంపూర్ వాగులో నడుచుకుంటూ అర్లీకి వెళ్లి పంటలు, నష్టపోయిన రైతులను పరామర్శించారు. పంట చేతికొచ్చే దశలో ఉన్నందున ప్రభుత్వం ఎకరాకు రూ.40 వేల పరిహారం చెల్లించాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి నష్టం వివరాలను సేకరించాలని సూచించారు. వర్షాలతో పాడయిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సంబంధింత శాఖల అధికారులను ఆదేశాలు జారీ చేశారు.

- బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్.

పంట నష్టం పరిహారం చెల్లించాలి..

జైనథ్, సెప్టెంబర్ 3 : వర్షాల వల్ల పెన్‌గంగా ఉధృతి పెరిగింది. నాకున్న ఐదెకరాల పత్తి పంట పూర్తిగా వరదల వల్ల నీట మునిగింది. మరో పదెకరాలు కౌలుకు తీసుకుని పత్తి వేశా. అది కూడా నీట మునిగి పూర్తిగా దెబ్బతిన్నాయి. కాంగ్రెస్ సర్కారు పంట నష్ట పరిహారాన్ని చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నా.

- మేర ఊశన్న, రైతు, కరంజి, జైనథ్ మండలం.

బేల మండలంలోని సాంగిడిలో రైతులతో మాట్లాడుతున్న జోగు రామన్న

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

- న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటాం
- కేటీఆర్ ఆదేశాల మేరకు పరామర్శ

ఉట్నూర్ రూరల్, సెప్టెంబర్ 3 : హస్నాపూర్ గ్రామానికి చెందిన రక్షిత నిజామాబాద్ జిల్లాలోని రుద్రూర్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో అనుమానాస్పదంగా మృతి చెందింది. కాగా.. బాధిత కుటుంబాన్ని మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరామర్శించారు. కేటీఆర్ ఆదేశాల మేరకు రక్షిత కుటుంబ సభ్యులను కలిసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్ న్యాయం జరిగేంత వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ సందర్భంఆ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులు వచ్చేంత వరకు ఆపకుండా పోస్టుమార్టం కొరకు పంపడం దుర్మార్గమని అన్నారు. అదేవిధంగా సీసీ పుటేజీలు మాయం చేయడం అనుమానాలకు దారితీస్తుందని అన్నారు. అనంతరం నిజామాబాద్ డీఎస్పీతో ఫోన్‌లో మాట్లాడుతూ న్యాయం జరిగేంత వరకు తాము ఊరుకునేదిలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఇంద్రవెల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరాం జాదవ్, తిరుమల్‌గౌడ్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, మాజీ వైస్ ఎంపీపీ సలీం మొద్దీన్, మాజీ సర్పంచ్ ఉపేందర్ జాదవ్, నాయకులు అజయ్ జాదవ్, కాటం రమేశ్, పాండురంగ్, భీంరావు, సురేందర్ యాదవ్, నిఖిల్, సదానంద్, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం

- సీసీఐ పునరుద్ధరణకు చర్యలు
- ఐటీ టవర్‌తో యువతకు ఉపాధి
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

ఆదిలాబాద్, సెప్టెంబర్ 3(నమస్తే తెలంగాణ) : వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలంతో కలిసి మూతపడిన సిమెంటు పరిశ్రమను పరిశీలించారు. పరిశ్రమ ప్రారంభానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. సీసీఐ పునరుద్ధరణ విషయంలో జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిసి కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామిని కలిసినట్లు తెలిపారు. సీసీఐని ప్రారంభించడం వల్ల వేలాది మందికి ఉపాధి లభించడంతోపాటు యువత వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు పెరుగుతాయన్నారు. సీసీఐకి సంబంధించి కలెక్టర్ పూర్తి నివేదిక అందించాలని సూచించారు. నూతన టెక్నాలజీతో కాలుష్య రహిత పరిశ్రమను ఏర్పాటు చేస్తామన్నారు. కేంద్రం ఆధీనంలో ఉన్న ఈ పరిశ్రమ ప్రారంభ విషయంలో స్థానిక బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీల సహకారం తీసుకుంటామన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ఆదుకుంటామని మంత్రి తెలిపారు. జైనథ్ మండలంలోని పెన్‌గంగను పరిశీలించారు. పంటలకు నష్టం వాటిల్లకుండా ఇరువైపుల రక్షణ చర్యలు చేపడుతామన్నారు. నష్ట పరిహారానికి సంబంధించి అధికారులు పూర్తిస్థాయి నివేదిక అందించాలని సూచించారు. అనంతరం జాతీయ రహదారికి సమీపంలో నిర్మిస్తున్న ఐటీ టవర్‌ను మంత్రి పరిశీలించారు. నాణ్యమైన పనులు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

గతంలో కాలనీలోకి వరదనీరు వచ్చిన ఫొటోలను తిలకిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ఆదిలాబాద్‌లోని పెన్‌గంగా ప్రవాహాన్ని పరిశీలిస్తూ..

జీఎన్ఆర్ కాలనీవాసులను ఆదుకుంటాం

- ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 3 : భారీ వర్షాలు, వరదలతో సమస్యలను ఎదుర్కొంటున్న జీఎన్ఆర్ కాలనీ వాసులకు అండగా ఉంటామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. మంగళవారం నిర్మల్ పట్టణంలోని జీఎన్ఆర్ కాలనీలో స్థానిక ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిలతో కలిసి మంత్రి పర్యటించారు. భారీ వర్షాల వల్ల ఇబ్బందులను కాలనీ వాసులు మంత్రికి వివరించారు. చెక్‌డ్యాం నిర్మాణాన్ని కుదించి నాల ప్రవాహ సామర్థ్యాన్ని పెంచి వరద నీటిని నియంత్రించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి మాట్లాడుతూ.. కాలనీ ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాలనీవాసుల సమస్యలను శాస్త్రీయంగా అధ్యయనం చేసి సాంకేతిక నిపుణులతో చర్చించి నివేదికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేసిన యంత్రాంగాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అమ్మద్, కిశోర్ కుమార్, భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్, డీఎస్పీ గంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజు, తహసీల్దార్ రాజు, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు పాల్గొన్నారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్ 3 : నిర్మల్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. స్థానిక గండి రామన్న సమీపంలోని ఫంక్షన్ హాల్‌లో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని కలిసి సూచనలు చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది బోట్లు, జాకెట్లు వంటి సామగ్రిని పరిశీలించారు.

ఎన్డీఆర్ఎఫ్ టీంతో మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, సెప్టెంబర్ 3 : నిరుద్యోగ యువత ప్రభుత్వ కొలువుల కోసం కాకుండా ప్రైవేట్ రంగంలో వచ్చే అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎస్పీ గౌష్ ఆలం సూచించారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో జీఎంఆర్ రక్ష సెక్యూరిటీ సంస్థలో ఉద్యోగాల కోసం మంగళవారం టీఎస్జీవోస్ భవనంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై జాబ్ మేళాను ప్రారంభించారు. అనంతరం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించి రక్ష సంస్థ ప్రతినిధులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు, పోలీసుల తరపున ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం నిర్వహించే జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంచి భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరు మంచి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రక్ష సెక్యూరిటీ సంస్థ పేరిట ఎయిర్ పోర్టు, నేషనల్ హైవేల్లో సెక్యూరిటీ కల్పించేలా సిబ్బందిని నియమిస్తున్నారన్నారు. మూడు నెలల శిక్షణ అనంతరం వారికి ఉద్యోగం కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సురేందర్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, రక్ష సెక్యూరిటీ సంస్థ ప్రతినిధి సుద్దం, సీఐలు బి సునీల్ కుమార్, సీహెచ్ కరుణాకర్‌రావు, ఫణిదర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి

- అన్ని మండపాల వద్ద హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నంబర్స్ ఏర్పాటు
- మట్టి వినాయకుల ప్రతిమలు ప్రతిష్ఠించాలి
- కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, సెప్టెంబర్ 3 : గణేశ్, మిలాద్ ఉన్ నబి వేడుకలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ మత సంఘాల పెద్దలు, పోలీసు, రెవెన్యూ, విద్యుత్, ఎక్సైజ్, మున్సిపల్, ఫైర్, నీటి పారుదల శాఖల అధికారుతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా హిందూ, ముస్లిం మత పెద్దల అభిప్రాయాలు, సలహాలు, సూచలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 7వ తేదీ నుంచి 11 రోజుల పాటు జరిగే వినాయక నవరాత్రి వేడుకలు, ఈనెల 17వ తేదీన జరిగే మిలాఉన్ నబి వేడుకలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టాలని, గుంతలు పూడ్చాలని, మున్సిపల్ శాఖ శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, మొబైల్ టాయిలెట్స్ నిమజ్జనం రోజు ఏర్పాటు చేయాలని, పిచ్చి మొక్కలు తొలిగించాలని, బ్లీచింగ్ పౌడర్ ఏర్పాట్లు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. విద్యుత్ శాఖ ద్వారా సీఎం ఆదేశాల మేరకు ఫ్రీ కరెంట్ ఇవ్వడం జరుగుతుందని, 9440811700 నంబర్‌కు కాల్ చేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సెక్యూరిటీ ఏర్పాటు, పెట్రోలింగ్ మూడు షిఫ్టులుగా ఏర్పాటు చేయడం జరుగుతుందని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్‌డీవో వినోద్‌కుమార్, జీవకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా